క్లుప్తంగా

మండలంగా ప్రకటించాలని వినతి

కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని మండల సాధన సమితి జేఏసీ నాయకులు సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ రవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు రామునాయక్, వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ 44 గ్రామపంచాయతీ ఉన్న కోయిల్‌కొండను మరో మండలంగా గార్లపహాడ్‌ను చేయాలన్నారు. కలెక్టర్ కమిటీ వేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందించాలని వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు నాగయ్య, వెంకటేష్, రాజు, యాదిరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాడ్జీల పంపిణీ

నవాబుపేట: మండలంలోని కాకర్లపహడ్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్ విధులు నిర్వహిస్తున్న విద్యార్థులకు సోమవారం బ్యాడ్జీలు అందజేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీ జనార్దన్, సర్పంచ్ జంగమ్మ, నర్సింహులు, కృష్ణయ్య, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

రాజాపూర్: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తిర్మలాపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు కులమతాలకు అతీతంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్వరీ, నాయకులు సంతోష్‌కుమార్‌గుప్తా, మల్లయ్య, ఏఎంసీ డైరెక్టర్ మోహన్‌రెడ్డి, రామకృష్ణగౌడ్, బీమయ్య పాల్గొన్నారు.

దోనూరులో వైద్యశిబిరం



మిడ్జిల్: మండలంలోని దోనూర్‌లో సోమవారం హైదరాబాద్‌కు చెందిన సుప్రజా ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 325 మందికి పరీక్షలు నిర్వహించగా, 43 మందికి మెరుగైన వైద్యసేవలు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శశిరేఖ, సర్పంచ్ సరిత, నాయకులు బాలు, చెన్నరవి, ఆరోగ్య మిత్ర కృష్ణ పాల్గొన్నారు.

నేడు మార్కెట్‌లో లావాదేవీలు

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో మంగళవారం యథావిధిగా లావాదేవీలు ఈనామ్ టెండర్ల ద్వారా ధాన్యం కొనుగోళ్లు జరుగుతాయని అధికారులు తెలిపారు. ఆదివారం, సోమవారం మన్యంకొండ జాతర సెలవు కారణంగా వరుసగా రెండు రోజుల పాటు మార్కెట్‌లో లావాదేవీలు జరగలేదు. తిరిగి మంగళవారం ప్రారంభం కానున్నాయి.

ఆలయానికి రూ.లక్ష విరాళం



భూత్పూర్: మండలంలోని మద్దిగట్లలో బీరప్ప గుడి మండప నిర్మాణానికి సోమవారం ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. గ్రామంలోని బీరప్ప ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం గుడి వద్దకు వెళ్లి ఉత్సవాల ఏర్పాట్లనుపరిశీలించిన అనంతరం కుల పెద్దలకు అందజేశారు. బీరప్ప ఉత్సవాల్లో భాగంగా బోనాలతో మహిళలు బోనాల ఊరేగింపు, డప్పులు, నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. బీజేపీ రాష్ట్ర నాయకుడు సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



అడ్డాకుల: మూసాపేట మండలం నిజాలాపూర్‌కు చెందిన గ్రామ పంచాయతీ వర్కర్ వెంకటయ్య ఇటీవల మృతిచెందాడు. స్థానిక సర్పంచ్ గడ్డమీది సత్యమ్మ, మరికొందరు గ్రామస్తులు రూ.35వేలను సోమవారం మృతుడి భార్య బాలకిష్టమ్మకు అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని సర్పంచ్ సత్యమ్మ తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో దివ్యాంగులపై చిన్నచూపు

భూత్పూర్: కేంద్ర బడ్జెట్‌లో దివ్యాంగులపై చిన్న చూపు చూశారని, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పూర్తిగా విస్మరించారని దివ్యాంగుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2022–23 బడ్జెట్‌లో దివ్యాంగులకు కేటాయించిన నిధుల్లో రూ.196 కోట్లు వినియోగించలేదని, ఈ ఏడాది రూ.150కోట్లుకు దిగజారిందని ఆరోపించారు.

బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

రైతులకు నిరాశే..



రైతు రుణమాఫీకి ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించలేదు. ఈసారి రుణ మాఫీ అవుతుందని ఆశపడిన రైతులు నిరాశే మిగిలింది. వ్యవసాయ రంగానికి నిధుల కేటాయింపు ఆశాజనకంగా ఉంది. వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులు, అనుబంధ రంగాలపై ఆధారపడి బతుకుతున్న వారిని ఆదుకోవాలి. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి.

– నాగన్న, తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి

పూర్తిగా వెచ్చించాలి..



ఆర్టీసీకి ఈ బడ్జెట్‌లో రూ.1,500 కోట్లు కేటాయించడం హర్షనీయం. సంస్థను లాభాల్లోకి తేవడానికి ఉద్యోగులంతా కష్టపడి పనిచేస్తున్నాం. గత బడ్జెట్‌లో కేటాయించిన నిధులు పూర్తిస్థాయిలో విడుదల చేయలేదు. గత బడ్జెట్‌లో మిగిలిన నిధులతోపాటు ఈసారివి కలిపి పూర్తి స్థాయిలో ఖర్చు చేస్తే సీసీఎస్, పీఎఫ్ బకాయిలు చెల్లించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులను ఆదుకోవాలి.

– భానుప్రకాశ్‌రెడ్డి, ఆర్టీసీ కండక్టర్

నిరుద్యోగులకు మొండిచేయి



ఈ బడ్జెట్‌లో నిరుద్యోగులకు మొండిచేయి చూపెట్టారు. నోటిఫికేషన్లు పేరుకే పరిమితమయ్యాయి. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పినా దాని ఊసేలేదు. ఉపాధి అవకాశాలకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదు. తూతూమంత్రంగా బడ్జెట్ రూపొందించారు. ఏళ్ల తరబడి ఎదురుచూపులు తప్ప పేదల స్థితిగతులు మెరుగయ్యే మార్గం లేకుండాపోతుంది. విద్యకు నిధుల కేటాయింపులో ఆశించిన స్థానం కల్పించలేదు.

– వీరేందర్, ప్రైవేట్ స్కూల్ టీచర్, వెన్నాచేడ్

సంతోషంగా ఉంది



రాష్ట్ర బడ్జెట్‌లో ఉద్యోగులు, రిటైర్డ్ అయిన వారి ఆరోగ్యం కోసం ట్రస్టు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం సంతోషంగా ఉంది. ఎంప్లాయిస్ హెల్త్ స్కీం (ఈహెచ్‌ఎస్) ద్వారా నగదు రహిత వైద్య సేవలు అందిస్తామనడం ఎంతో బాగుంది. దీనికి ఏటా రూ.700 కోట్లు కేటాయిస్తామని ప్రకటించడంపై సంఘం తరపున ధన్యవాదాలు చెబుతున్నాం.

– నరేందర్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం

హర్షణీయం..



బడ్జెట్‌లో రుణమాఫీకి రూ.6,300 కోట్లు కేటాయించడం హర్షించదగ్గ నిర్ణయం. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమా పథకాల అమలుతోపాటు ఆయిల్‌పాం రైతులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించింది.

– వెంకటేశ్వర్‌రెడ్డి, రైతు, మాచన్‌పల్లి, మహబూబ్‌నగర్ రూరల్ మండలం

అభినందనీయం..



రాష్ట్ర బడ్జెట్ ఉద్యోగులకు మేలు చేసేదిగా ఉంది. ముఖ్యంగా ఉద్యోగుల కోసం హెల్త్ కేర్ ట్రస్టు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించడం అభినందనీం. ఉద్యోగులు ఎప్పటి నుంచో అడుగుతున్న ఈహెచ్‌ఎస్ విధానాన్ని ఈ ఆర్థిక సంవత్సరంలో తీసుకురావడం మంచిదే. ట్రస్టు ఏర్పాటుకు ప్రభుత్వ ప్రతినిధులతోపాటు ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల ప్రతినిధులను భాగస్వామ్యం చేస్తామనడం శుభ పరిణామం.

– బాల్‌కిషన్, రిటైర్డ్ ఎంప్లాయి పెన్షనర్ల సంఘం జిల్లా కార్యదర్శి

రుణపడి ఉంటాం..

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దళితబంధు పథకానికి రూ.17,700 కో ట్లు ప్రతిపాదించడం హర్షణీయం. 118 నియోజకవర్గాల్లో ప్రతిచోట 1,100 మంది దళితులకు దళితబంధు ఇవ్వాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– రాయికంటి రాందాస్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్: మండలంలోని కొత్తమొల్గర, ఎల్కిచర్ల, పాత మొల్గర గ్రామాల్లో సోమవారం వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం మద్దిగట్లలో జరుగుతున్న బీరమ్మ జాతర ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కొత్త మొల్గర, ఎల్కిచర్ల, పాత మొల్గలో రూ.20లక్షల చొప్పున నూతనంగా నిర్మించే గ్రామ పంచాయతీ భవనాలు, రూ.10లక్షలతో చేపట్టే సీసీ రోడ్లు నిర్మాణానికి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. మద్దిగట్లలో బీరప్ప జాతరలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ బస్వరాజ్ గౌడ్, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, విండో చైర్మన్ కదిరె అశోక్ రెడ్డి, నాయకులు నారాయణ గౌడ్, సర్పంచ్‌లు వెంకటమ్మ, పద్మ, సుజాతమ్మ, నర్సింహులు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి



నవాబుపేటలో కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు



కంచన్‌పల్లిలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవాబుపేట: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. మండల కేంద్రంలో 2,200 మందికి పరీక్షలు చేయగా, కొల్లూర్‌లో 3,260 మందికి, లింగన్నపల్లిలో 389, కాకర్‌జాల్‌తండాలో 334 మందికి కంటి పరీక్షలు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్‌గౌడ్, మండల వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి, శరభలింగం, అవినాష్, వైద్య సిబ్బంది నిర్మల, మాధవి, సునిత, విమల పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిలో కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం ఎంపీడీఓ జయరాములు సందర్శించారు. శిబిరంలో ఏర్పాటు చేసిన వసతులు, కంటి పరీక్షలు జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు పథకం వరం లాంటిదని కంచన్‌పల్లి సర్పంచ్ అంజిలయ్య తెలిపారు. సోమవారం కంచన్‌పల్లి, మహమ్మదాబాద్ గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమం ద్వారా 393 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లక్ష్మి, కార్యదర్శి సుభద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సెల్ఫీ విత్ రంగోళికి అనూహ్య స్పందన



మాట్లాడుతున్న జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల టౌన్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహించిన సెల్ఫీ విత్ రంగోళికి భారీ స్పందన లభించిందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం అల్మాస్‌గార్డెన్‌లో సెల్ఫీ విత్ రంగోళిలో పాల్గొన్న మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అనురుధ్‌రెడ్డి మాట్లాడుతూ మొత్తం 1,720 మంది ముగ్గులను పంపించారన్నారు. పోటీల్లో పాల్గొన్న వారిలో 50మందికి గోల్డ్‌కాయిన్స్, 50మందికి సిల్వర్‌కాయిన్స్ అందించారు. మిగిలిన 1,620 మందికి చీరలను అందజేశారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు వసంత మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అనగానే రంగురంగుల రంగవల్లులు తీర్చిదిద్దటం మహిళలకు ఎంతో ఇష్టమని, పోటీలు నిర్వహించి బహుమతులు అందించటం ప్రశంసనీయమని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ మహిళా ఇన్‌చార్జ్ మీనాక్షి, మాజీ మార్కెట్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ



దోకూర్‌లో మహా పడిపూజలో పాల్గొన్న భక్తులు

దేవరకద్ర: మండలంలోని డోకూర్‌లో సోమవారం ద్వాదశ జ్యోతిర్లింగ మహా పడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వందలాది మంది శివ స్వాములతో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. పూజల అనంతరం భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. బీజేపీ పాలమూరు పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యజ్ఞభూపాల్‌రెడ్డి, సర్పంచ్ రామరకృష్ణరెడ్డి పాల్గొన్నారు.

రాజాపూర్: మండలంలోని రాయపల్లి దుర్గామాత ఆలయ ప్రాగణంలో సోమవారం గురుస్వామి వాసుదేవచారి ఆధ్వర్యంలో భక్తులు మహాపడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పంచామృతంతో లింగాభిషేకం చేశారు. శివస్వాములు ఆలపించిన భక్తిగీతాలతో శివనామస్మరణ మారుమ్రోగింది. అనంతరం మాజీ సర్పంచ్ కిష్టారం సరోజమ్మ, ఏఎంసీ డైరెక్టర్ మల్లేష్‌గౌడ్ భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాధర్‌గౌడ్, ఎంపీటీసీ శేఖర్‌గౌడ్, నాయకులు వెంకటరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఉద్దేష్‌గౌడ్, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



దేవరకద్ర: మండలంలో చదివే పదో తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సహకారంతో ఆల రఘుపతిరెడ్డి ట్రస్ట్ కింద ప్రత్యేకంగా రూపొందించిన ఆల్ ఇన్ వన్ మెటీరియల్‌ను సోమవారం పంపిణీ చేశారు. మండలంలోని డోకూర్ సమీపంలో ఉన్న కస్తూర్బా పాఠశాలలో 41 మంది విద్యార్థినులకు మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

బాలానగర్: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందిన ఉల్కుందకార్ లక్ష్మీబాయికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చొరవతో రూ.లక్ష సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. సోమవారం వైస్ ఎంపీపీ వెంకటచారి చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ రావు, రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మైనార్టీ వైస్ చైర్మన్‌గా ఖయ్యూం

జడ్చర్ల: కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ వైస్ చైర్మన్‌గా జడ్చర్లకు చెందిన ఖయ్యూం నియామకమయ్యారు. సోమవారం డీసీసీ కార్యాలయంలో మైనార్టీ సెల్ చైర్మన్ జహీర్ అక్తర్, డీసీసీ అధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్ తదితరులు నియామకం పత్రం అందజేసినట్లు ఖయ్యూం తెలిపారు.

సస్యరక్షణ చర్యలు అవసరం

జడ్చర్ల: రైతులు సాగు చేసిన పంటలకు సస్యరక్షణ చర్యలు తీసుకొని పంటలను కాపాడుకోవాలని వరి పరిశోధన కేంద్రం హైదరాబాద్‌కు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ వర్మ తెలిపారు. సోమవారం మండలంలోని బూర్గుపల్లి గ్రామ శివారులో రైతు శంకర్ సాగు చేసిన వరి పంటను ఆయన పరిశీలించారు. చౌడు ప్రభావం, తక్కువ ఉష్ణోగ్రతల కారణంగా వరిపంట ఎండిపోయినట్లు ఆయన గుర్తించారు. ఇందుకుగాను సాఫ్ 200 గ్రాములు, జింక్ సల్ఫేట్ 200 గ్రాములు కలిపి ఆరు రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని సూచించారు. అదేవిధంగా కాండం తొలుచు పురుగు నివారణకు పొలంలో తక్కువ నీటిని ఉంచి కర్టాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలను జల్లి రెండు రోజుల వరకు మడుల నుంచి బయటకు నీరును తీయవద్దన్నారు. అదేవిదంగా నాచు ఎక్కువగా ఉన్న పొలాల్లో నాచుని తొలగించి కలియబెట్టాలన్నారు. కార్యక్రమంలో పాలెం ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ రామకృష్ణ, పాతాలజీ శాస్త్రవేత్త కిరణ్, ఏఓ గోపినాథ్, ఏఈఓ నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై చర్య తీసుకోండి

బాలానగర్: మండలంలోని పలుగుమీది తండా గ్రామ పంచాయతీలోని బోజనానంపేట్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 83లో సమీపంలోని ప్రైవేటు పరిశ్రమ వ్యక్తులు కబ్జా చేశారని గ్రామ డిప్యూటీ సర్పంచ్ శివకుమార్ కలెక్టర్ రవికి ఫిర్యాదు చేశారు. గ్రామ పరిధిలో ఉన్న పల్లెప్రకృతి వనానికి సైతం వెళ్లకుండా గతంలోనే గేటు ఏర్పాటు చేసుకుని సీసీ కెమెరాలు, కంచె ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. మూడెకరాల ప్రభుత్వ భూమిలో పల్లె క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు ఎకరా భూమి తహసీల్దార్ శ్రీనివాస్ సర్వే చేయించి కేటాయించినా పరిశ్రమ వ్యక్తులు అడ్డుపడుతూ పోలీసులతో బెదిరిస్తున్నారని వాపోయారు. ఇలాగైతే గిరిజన తండాల ఎలా అభివృద్ధి చెందుతాయని వాపోయారు. సర్పంచ్ భర్త రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలి భర్త బాలునాయక్, వార్డు సభ్యులు కేతావత్ బాలునాయక్, గ్రామస్తులు సూర్య తదితరులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.



ఆయుర్వేద వైద్యంపై అవగాహన



మాట్లాడుతున్న వైద్యురాలు లావణ్య

అడ్డాకుల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఆయుర్వేద వైద్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ లావణ్య స్థానిక వైద్య సిబ్బందితో పాటు ఆశావర్కర్లకు అవగాహన కల్పించారు. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ లేకుండా వ్యాధులను నయం చేసే అవకాశం ఆయుర్వేదంలో ఉందన్నారు. కీళ్ల, చర్మ వ్యాధులు, మహిళలు, బాలికల ఆరోగ్య సమస్యలకు మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆయుర్వేద వైద్యాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌ఓ భాస్కర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీనియార్టీలో ఉమ్మడి సర్వీస్ లెక్కించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఆల్‌మేవా ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతికి అర్హత కలిగిన ఎస్‌జీటీ ఉపాధ్యాయుల సీనియార్టీ రూపొందించేటప్పుడు తెలుగు, ఉర్దూ మీడియం ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ లెక్కించాలని కోరూతూ ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు షేక్‌ఫారుఖ్ హుస్సేన్, సయ్యద్ మహ్మద్ అవేజ్ ఖాద్రీ సోమవారం హైదరాబాద్‌లో డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ జేడీకి వినతిపత్రం అందజేశారు. జీహెచ్‌ఎం, పీఈటీ, ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్లకు మాధ్యమాలతో సంబంధం లేకుండా ఉమ్మడి సీనియార్టీ ప్రాతిపదికన పదోన్నతులు ఇస్తున్నారని, అదేవిధంగా ఎల్‌ఎఫ్‌ఎల్ సీనియార్టీని కూడా ఉర్దూ, తెలుగు మీడియం ఎస్‌జీటీలను ఉమ్మడి సీనియార్టీ ప్రకారం పదోన్నతులు ఇవ్వాలని వినతిలో కోరారు. ఉర్దూ, తెలుగు మీడియం పాఠశాలలు కూడా కలిసే నిర్వహిస్తున్నందునా, ఉమ్మడి సీనియార్టీ ప్రాతిపదికన ఎల్‌ఎఫ్‌ఎల్ పదోన్నతులు కల్పించి ఉర్దూ ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో అజీజ్ ఫాతిమా, వహీదా సుల్తాన్ ఉన్నారు.

మన్యంకొండ జాతరలో వలంటీర్ల విధులు



మాట్లాడుతున్న నటరాజ్

పాలమూరు: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎంవీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు 50మంది, ఎన్‌టీఆర్ కళాశాల విద్యార్థులు 36మంది వలంటీర్లుగా సోమవారం నుంచి మన్యంకొండ జాతరలో విధులు నిర్వహిస్తున్నారు. అన్నదాన సత్రం, భక్తుల క్యూలైన్, లడ్డు ప్రసాద కౌంటర్ వద్ద క్యూలైన్‌లో భక్తులను క్రమబద్ధీకరించడం వంటి పనులు వలంటీర్లు నిర్వహించారు. దీంతో పాటు సీపీఆర్‌లో శిక్షణ పొందిన వలంటీర్లు ప్రథమ చికిత్స కేంద్రం వద్ద విధులు నిర్వహించారు. మొదట వలంటీర్లకు రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్, ఎంవీఎస్ కళాశాల ఎన్‌సీసీ అధికారి విజయ్‌కుమార్ విధులు కేటాయించడంతో పాటు ఎలా పని చేయాలి అనే అంశంపై సూచనలు చేశారు.

బీజేపీ జెండా ఎగరడం ఖాయం



నాయినోనిపల్లిలో మాట్లాడుతున్న ఎన్‌పీ వెంకటేశ్

మహబూబ్‌నగర్ రూరల్: రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, పార్టీ మండల ఇన్‌చార్జ్ పాండు రంగారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రామచంద్రాపూర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు రాజుగౌడ్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ అధికారం చేజిక్కించుకునేందుకునేలా కేంద్ర అధినాయకత్వం కార్యాచరణ రూపొందిస్తుందని అన్నారు. బూత్ స్థాయిలో పార్టీ బలోపేతం చేయడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని అన్నారు. గిరిజన ఆదివాసీ జిల్లా అయిన ములుగు ప్రాంతాన్ని ప్రజాప్రతినిధులు గాలికి వదిలేసారని, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై క్షేత్ర స్థాయిలో పోరాటం చేయడానికి ప్రతిఒక్కరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను పక్కదారి పట్టించి అభివృద్ధికి అడ్డుపడుతున్నారని, కేసీఆర్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో నిరుద్యోగులు సరైన ఉద్యోగ అవకాశాలు లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. 317 జీఓను తీసుకొచ్చి ప్రభుత్వ ఉద్యోగుల పాలిట శాపంగా మారిందని, బీజేపీ చేపట్టిన రాష్ట్ర వ్యాప్త ఆందోళనతోనే ప్రభుత్వం దిగివచ్చి ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తుందని అన్నారు. మండల స్థాయిలో శక్తి కేంద్ర సమావేశాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. సమావేశంలో చౌదర్‌పల్లి సర్పంచ్ శంకరమ్మ, నాయకులు ఎన్‌పీ వెంకటేష్, శ్రీరాములు, తిరుపతిరెడ్డి, విజయలక్ష్మి, రాఘవేందర్‌గౌడ్, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గ సమావేశం..

హన్వాడ: కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాల్సిన అవసరం ఉందని బీజేపీ జిల్లా నాయకుడు ఎన్‌పీ వెంకటేశ్ తెలిపారు. సోమవారం మండలంలోని నాయినోనిపల్లిలో బీజేపీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌పీ వెంకటేశ్ మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో బీజేపీ పాత్ర ఎంతో ఉన్నదని అన్నారు. గ్రామీణ స్థాయి నుంచి కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి



మాట్లాడుతున్న ఎస్‌ఎంఐఎంఎస్ యూనివర్సిటీ డైరెక్టర్ సిద్దార్థ్‌గోష్

జడ్చర్ల: విద్యార్థులు తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా కష్టపడి కాకుండా ఇష్టంతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఎస్‌ఎంఐఎంఎస్ యూనివర్సిటీ జడ్చర్ల డైరెక్టర్ సిద్దార్థ్‌గోష్ పేర్కొన్నారు. సోమవారం యూనివర్సిటీలో విద్యార్థులు, తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ ఎంతో విలువైందని, తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ముచేయకుండా తమ ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. సమావేశంలో షాద్‌నగర్, జడ్చర్ల, నారాయణపేట్, మహబూబ్‌నగర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఎస్‌వీకేఎం ప్రిన్సిపల్ ఎబినేజర్, ప్రొఫెసర్ మహేష్‌కుమార్, అశ్వినీదేష్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తే చర్యలు తప్పవు



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

గండీడ్: సారా తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, కోస్గి ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జిన్నారం తండాలో కొంతకాలంగా సారా తయారు చేస్తున్నారన్న సమాచారంతో సోమవారం టాస్క్‌ఫోర్స్ సీఐ నర్సిరెడ్డి, కోస్గి సీఐ బాలకృష్ణ సిబ్బందితో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఇద్దరి వద్ద 9లీటర్ల సారా స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. సారా తయారు చేస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని, చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమానం ఉన్న 6మందిని బైండోవర్ చేయనున్నట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు. దాడుల్లో ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది రవికుమార్, దయాకర్, కృష్ణయ్య, ఏలియా, రమేష్ పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

గండీడ్: మండలంలోని పలు గ్రామాల్లో వేంకటేశ్వర స్వామి రథోత్సవాలను ఘనంగా నిర్వహించారు. జాతర ఉత్సవాల్లో భాగంగా జంగంరెడ్డిపల్లిలో రెండు రోజుల నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వెన్నాచేడ్‌లో భాజాభజంత్రీలు, వేదమంత్రోచ్చరణలతో స్వామివారిని ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు హన్మంతు, పుల్లారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.